ప్రజాశక్తి

మంగళవారం 24 జూన్, 2025 5

శ్రీకాకుళం



అభ్యంతరాలు తెలియజేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

సమగ్ర శిక్షా అభియాన్ పరిధిలో కెజిబివిల బోధన, బోధనేతర సిబ్బంది బదిలీలకు ఆప్షన్లు ఇచ్చుకున్నారని, అభ్యంతరాలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ఎపిసి డాక్టర్ ఎస్.శశిభూషన్ ప్రకటలో తెలిపారు. వివరాలు https://sites.com/google.com/site/deosklorg వెబ్‌సైట్‌లో ఉన్నట్లు చెప్పారు. అభ్యంతరాలు స్వీకరణ అనంతరం బదిలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 26న కార్యాలయం పనివేళల్లో సంప్రదించాలని సూచించారు. అందరి ఆమోదవతో బదిలీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

బదిలీలకు లైన్ క్లియర్



సచివాలయ ఉద్యోగుల బదిలీలకు లైన్ క్లియర్ అయింది. బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ఈనెల 12న జిఒ నంబరు 5 పేరుతో మార్గదర్శకాలను వెలువరించింది. అందులో సొంత మండలాల్లో పనిచేయకూడదనే నిబంధనతో ఉద్యోగుల్లో వ్యతిరేకత వ్యక్తమైంది. దీంతో కొద్దిరోజుల పాటు బదిలీల ప్రక్రియకు బ్రేక్ పడింది. ఉద్యోగులతో చర్చించిన తర్వాత వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, నిబంధనను సవరిస్తూ తాజాగా జిఒ నంబరు 6ను విడుదల చేసింది. మున్సిపాలిటీల్లో అయితే సొంత మండలం బదులుగా సొంత వార్డుల్లో పనిచేయకూడదనే మార్పును తీసుకొచ్చింది. బదిలీలకు సంబంధించిన ప్రక్రియను ఈనెల 30వ తేదీ లోగా పూర్తి చేయాలని కలెక్టర్లకు ప్రభుత్వం సూచించింది.

- సొంత మండలంలో పనిచేయకూడదనే నిబంధన ఎత్తివేత
- సవరణతో తాజాగా జిఒ నంబరు 6 విడుదల
- ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి స్థానచలనం
- కసరత్తు చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో 732 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాల్లో 657, అర్బన్ ప్రాంతాల్లో 75 సచివాలయాలు ఉన్నాయి. వీటిని 380 క్లస్టర్లుగా విభజించారు. వీటిలో మొత్తం 6,420 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జనాభా 2,500 లోపు ఉంటే ఎ-కేటగిరీ, 2501 నుంచి 3,500 మంది ఉంటే బి-కేటగిరీగా విభజించారు. అదేవిధంగా 3,501 మంది పైన ఉంటే సి-కేటగిరీగా నిర్ణయించారు. జిల్లాలో ఎ-కేటగిరీ పరిధిలో 207, బి-కేటగిరీ కింద 282, సి-కేటగిరీ కింద 243 సచివాలయాలు ఉన్నాయి. ఎ-కేటగిరీలో ఆరుగురు ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో సాధారణ అవసరాల విధుల కోసం ఇద్దరు, ప్రత్యేక అవసరాల విధుల కోసం నలుగురు ఉద్యోగులు పనిచేస్తున్నారు. బి-కేటగిరీలో ఏడుగురు ఉండగా, వీరిలో సాధారణ విధుల కోసం ముగ్గురు, ప్రత్యేక విధుల కోసం నలుగురు పనిచేస్తున్నారు. సి-కేటగిరీలో ఎనిమిది మంది ఉండగా వీరిలో సాధారణ, ప్రత్యేక విధుల కోసం నలుగురేసి చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఈ ఏడాది మే 31వ తేదీ నాటికి ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం బదిలీ చేయనుంది. ఇందుకు సంబంధించి అధికారులు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టారు.

బదిలీకి సంబంధించిన మార్గదర్శకాలు ఇవే...

ఉద్యోగుల్లో ఐదేళ్లు ఒకేచోట పని చేసిన వారికి కచ్చితంగా స్థానచలనం ఉండనుంది. దీంతోపాటు ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ప్రభుత్వం వారి సొంత వినతిపై బదిలీ చేయనుంది. సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పలు ప్రభుత్వ శాఖలు, ఎంపిడిఒల పర్యవేక్షణలో పనిచేస్తున్నారు. పని స్వభావం ఆధారంగా వారిని బదిలీ చేయనున్నారు. ఖాళీల వివరాలను ఆయా ప్రభుత్వ శాఖలకు సంబంధించిన పోర్టల్‌లో పొందుపరచనున్నారు. ఉమ్మడి జిల్లా ఆధారంగా బదిలీల ప్రక్రియ నిర్వహించనున్నారు. మానసిక వ్యాధితో బాధపడుతున్న పిల్లలు ఉన్న ఉద్యోగులు, 40 శాతానికి పైగా అంగవైకల్యం ఉన్న వారికి బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వనుంది. ఏజెన్సీ ప్రాంతంలో రెండేళ్లు పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. ఉద్యోగి లేదా భార్య లేక భర్త, వారిపై ఆధారపడిన పిల్లలు కేన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ మార్పిడి వంటి వ్యాధులతో బాధపడుతున్న వారికి మినహాయింపు ఇవ్వాలని నిర్ణయించింది. భర్త మరణంతో ఉద్యోగం పొందిన మహిళలకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొంది.

అంధులకు బదిలీల్లో మినహాయింపు

అంధులైన ఉద్యోగులకు వారు కోరుకుంటే తప్ప ప్రభుత్వం వారికి బదిలీల్లో మినహాయింపు ఇచ్చింది. భార్యాభర్తలు ఇరువురూ ఉద్యోగులైతే ఒకే సచివాలయం, సమీప సచివాలయానికి బదిలీ చేయాలని అధికారులకు సూచించింది. బదిలీలు పూర్తయిన తర్వాత ఎవరైన ఉద్యోగి ఆ సచివాలయానికి కేటాయించిన సిబ్బంది కంటే ఎక్కువైతే, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు అదే గ్రామ, వార్డు సచివాలయంలో పనిచేయించాలని ప్రభుత్వం సూచించింది. బదిలీల సందర్భంగా నాన్ ఐటిడిఎ నుంచి ఐటిడిఎ ప్రాంతానికి వెళ్తున్న ఉద్యోగులు నిర్దేశించిన తేదీలో చేరాల్సి ఉంటుంది. ఎవరైనా ఉద్యోగి ఐటిడిఎకు రిపోర్టు చేయకుంటే క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల ఆందోళన

- సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి
- లేకుంటే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి
- అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్
- కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

తల్లికి వందనం, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని, లేకుంటే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు, వేతనాల పెంపు తదితర డిమాండ్లతో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన అంగన్వాడీలు ఆందోళన చేపట్టారు. నగరంలోని ఆర్అండ్‌బి బంగ్లా రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు నిరసన ప్రదర్శనగా వెళ్లి అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.కళ్యాణి, డి.సుధ మాట్లాడుతూ టిడిపి కూటమి ఎన్నికల ముందు చిరుద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని మేనిఫెస్టోలో హామీనిచ్చిందని గుర్తు చేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సర్క్యులర్ కూడా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని విమర్శించారు. సాధికార సర్వేలో అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా నమోదు చేయడంతో పథకాలు అమలు కావడం లేదని తెలిపారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని, లేకుంటే ప్రభుత్వ ఉద్యోగులుగానైనా గుర్తించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఇకెవైసి నమోదు, లబ్ధిదారులకు ఒటిపిలతో అంగన్వాడీలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. సెల్‌ఫోన్లు పనిచేయడం లేదని, ఇంటర్నెట్ రాని చోట కూడా ఎఫ్ఆర్ఎస్ అమలు చేయాలని వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 42 రోజుల సమ్మె సందర్భంగా 2024 జూలైలో వేతనాలు పెంచుతామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చామని అసెంబ్లీ సాక్షిగా ఐసిడిఎస్ మంత్రి ప్రకటించినా, నేటికీ జిఒ విడుదల చేయలేదన్నారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ముఖ ఆధారిత గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) రద్దు చేయాలని, మినీ అంగన్వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జిఒ ఇవ్వాలన్నారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు ఆపాలని, తొలగించిన అంగన్వాడీలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం జిల్లా పరిషత్‌లో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కె.సూరయ్య, ఎన్.వి రమణ, ఆర్.ప్రకాశరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎన్.హైమావతి, పి.లతాదేవి, కె.సుజాత, జె.కాంచన, కె.లక్ష్మి, ఎస్.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఆస్తుల ప్రైవేటీకరణే అభివృద్ధా?

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమే అభివృద్ధా అని వారు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలో కార్పొరేషన్ ఆస్తులను ప్రైవేటీకరణ చేస్తే ప్రజలు సహించరని అన్నారు. నగరంలోని సిపిఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శ్రీకాకుళం నగరంలో చారిత్రకమైన మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం, పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్, బాపూజీ కళామందిర్, గాంధీ పార్కు, డైమండ్ పార్కు, కార్గిల్ పార్కు, నాగావళి రివర్ పార్కు, ఎల్‌బిఎస్ కాలనీ పార్కు, జిల్లా గ్రంథాలయంతో పాటు పెద్దపాడు చెరువు, విజయాదిత్య పార్కు తదితర కోట్లాది రూపాయల ఆస్తులను కారుచౌకగా ఎందుకు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడానికి పూనుకున్నారని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రమంత్రిగా శ్రీకాకుళం నగర అభివృద్ధికి ప్రభుత్వం నుంచి మీరు నిధులు ఎందుకు తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. ఇదేనా మీరు చేస్తున్న అభివృద్ధి అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఎందుకు నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. 2024-25లో శ్రీకాకుళం నగర కార్పొరేషన్‌లో ప్రజల నుంచి పన్నుల రూపంలో రూ.28 కోట్లు ప్రభుత్వం వసూలు చేసిందని, అందులో రూ.15 కోట్లు వాటి అభివృద్ధికి కేటాయిస్తే సరిపోతుందన్నారు. ప్రైవేటీకరణ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. విలువైన ప్రభుత్వ ఆస్తులను కొందరు రాజకీయ అండతో కాజేయాలని చూస్తున్నారని విమర్శించారు. దీనిపైన ప్రజలు ఆలోచన చేయాలని, ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పి-4 అంటే ప్రభుత్వ విలువైన ఆస్తులను ప్రైవేటీకరణ చేయడమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆస్తుల ప్రైవేటీకరణ ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

పరీక్ష సమయాల మార్పు


శ్రీకాకుళం సిటీ : జిల్లాలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల విద్యాలయాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6, 7, 8, 9 తరగతిల్లో మిగిలి ఉన్న సీట్ల అడ్మిషన్ కోసం దరఖాస్తు స్వీకరణ ప్రక్రియ ఇప్పటికే 8 పాఠశాలలో జూన్ 19 నుంచి నిర్వహిస్తున్నట్టు గురుకులాల జిల్లా సమన్వయకర్త గుంపుల గ్రేస్ సోమవారం వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జిల్లావ్యాప్తంగా బాలురుకు దుప్పలవలస, బాలికలకు ఎచ్చెర్లలోను జూన్ 25న, 6, 7వ తరగతులకు ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, అదేరోజు మధ్యాహ్నం 8, 9వ తరగతులకు విద్యార్థులకు 2 నుంచి 3 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు పరీక్ష సమయాల మార్పును గమనించగలరని తెలియజేశారు. దరఖాస్తు చేసుకునేందుకు గడువు మరో రెండు రోజులు ఉందన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి వెనుకబడిన తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9701736862, 9000314209 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు
- 'మీకోసం'కు 106 అర్జీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

మీకోసంకు వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో అర్జీలు స్వీకరించారు. స్వీకరించిన అర్జీల్లో రెవెన్యూ, పంచాయతీరాజ్, డ్వామా, మహిళా శిశు సంక్షేమం, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా పంచాయతీ, ఎపిఇపిడిసియల్, సర్వే, భూగర్భ గనులు, ఇరిగేషన్, తదితర శాఖల సమస్యలపై 106 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో అర్జీలు డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయా శాఖల వద్ద పెండింగ్‌లో అర్జీలపై సమీక్షించారు. అర్జీలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



వినతులను స్వీకరిస్తున్న డిఆర్‌ఒ వెంకటేశ్వరరావు

డయేరియా రహిత సమాజానికి కృషి

జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం సిటీ డయేరియా రహిత సమాజాన్ని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో స్టాప్ డయేరియా పోస్టర్‌ను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి వచ్చే నెలా 31 వరకు ఇంప్లిమెంటేషన్ పేజ్-2లో భాగంగా డయేరియా నివారణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికా రులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశామ న్నారు. ఐదు ఏళ్లలోపు చిన్నారుల్లో అతిసార వ్యాధి ప్రబలకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబెట్లు ఇంటింటికీ పంపిణీ చేసినట్లు వివరించారు. పంచాయతీరాజ్‌శాఖ సమన్వయంతో నీటి నాణ్యత పరీక్షలు చేయడం, ట్యాంకుల శుభ్రత, క్లోరినేషన్ వంటి చేపడుతున్నామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.పద్మావతి, డిఆర్‌డిఎ పీడీ కిరణ్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి భారతీసౌజన్య, పౌర సరఫరాలశాఖ జిల్లా మేనేజర్ వేణుగోపాల్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రామ్సు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు



జెడ్‌పి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వైసిపి నాయకులు

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- వైసిపి జిల్లా అధక్షులు ధర్మాన కృష్ణదాస్
- జెడ్‌పి వద్ద యువత పోరు

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీ అమలు చేయాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ డిమాండ్ చేశారు. వైసిపి యువజన విభాగం ఆధ్వర్యాన యువత పోరు పేరిట జిల్లా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. తొలుత నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ్నుంచి ర్యాలీగా జెడ్‌పికి చేరుకుని అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ నమ్మి ఓటు వేసిన ప్రజలకు కూటమి ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. ఎన్నికల ముందు నిరుద్యోగులకు రూ.మూడు వేల నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఉన్నత విద్యను ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని ధ్వజమెత్తారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. స్కాలర్‌షిప్‌లు కూడా విద్యార్థులకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంక్షలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. బూటకపు హామీలతో అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేస్తోందని దుయ్యబట్టారు. రెడ్ బుక్ రాజ్యాంగంతో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరన్నారు. ధర్నా అనంతరం జెడ్‌పిలో నిర్వహిస్తున్న 'మీకోసం'లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యేలు రెడ్డి శాంతి, గొర్లె కిరణ్ కుమార్, నాయకులు పేరాడ తిలక్, చింతాడ రవికుమార్, కంభంపాటి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఇంకెన్నేళ్లు..?

- జెడ్‌పిని ముట్టడించిన ఆఫ్‌షోర్ నిర్వాసితులు
- గేట్లు తోసుకుని లోపలకు వెళ్లేందుకు యత్నం
- పోలీసులు, నిర్వాసితుల సమస్యల వాగ్వివాదం
- అధికారుల హామీతో ఆందోళన విరమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఆఫ్‌షోర్ నిర్వాతులు ఆందోళన చేపట్టారు. ప్రజాసంఘాల ఆధ్వర్యాన 'మీ కోసం' గ్రీవెన్స్ నిర్వహిస్తున్న జిల్లాపరిషత్ కార్యాలయానికి పెద్దసంఖ్యలో చేరుకుని ముట్టడించారు. రెండు గంటల పాటు ఆందోళన సాగినా అధికారుల్లో స్పందన లేకపోవడంతో మూకుమ్మడిగా జెడ్‌పిలోకి వెళ్లేందుకు గేట్లు తోసేందుకు ప్రయత్నించడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, నిర్వాసితుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. నిర్వాసితుల నుంచి ప్రతిఘటన పెరగడంతో, పోలీసులు జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావుకు విషయాన్ని వివరించారు. దీంతో ఆయన అధికారులతో కలిసి ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యలపై చర్చించారు. జూలై రెండో తేదీ లోపు నిర్వాసిత మండలాలు నందిగాం, పలాస, మెళియాపుట్టిలోని ఏడు గ్రామాల పరిధిలో గ్రామసభలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. దీంతో శాంతించిన నిర్వాతులు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2008లో ఏడు రెవెన్యూ గ్రామాల పరిధిలో మూడు వేల ఎకరాల భూములు సేకరించి 17 సంవత్సరాలు పూర్తయినా సమస్య పరిష్కరించలేదన్నారు. మూడు ప్రభుత్వాలు మారినా నిర్వాసిత కుటుంబాలకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించలేదని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడు గతంలో అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అయినా నేటికీ పునరావాసం కల్పించకపోవడం అన్యాయమన్నారు. ఎన్నికల ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చి ఏడాది గడిచినా నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. గత్యంతరం లేని స్థితిలో ఏడు గ్రామాల ప్రజలు మెళియాపుట్టి మండలం చీపురుపల్లిలో 33 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా మంత్రులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రూ.350 కోట్లు ఖర్చు పెట్టి యోగా చేసిన పాలకులు, నిర్వాసితులకు రూ.50 కోట్లు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితుల సమస్యలు జూలై ఐదో తేదీ లోపు పరిష్కరించకుంటే, కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ధర్నాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిర్ల ప్రసాదరావు, గంగరావు సింహాచలం, ప్రజాసంఘాల నాయకులు చాపర వెంకటరమణ, యుగంధర్, లండ వెంకటరావు, పోలాకి ప్రసదరావు, సర్పంచ్ వై.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జెడ్‌పి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఆఫ్‌షోర్ నిర్వాసితులు

చట్ట పరిధిలో ఫిర్యాదుల పరిష్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్‌పి రమణ

ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించనున్నట్లు అదనపు ఎస్‌పి వి.రమణ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కార వేదిక (మీకోసం) నిర్వహించి వినతులు స్వీకరించారు. జిల్లా నుంచి 58 మంది ఫిర్యాదులు చేశారు. ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదుదారుల అర్జీలు, వారి వివరాలు సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని క్షేత్రస్థా యి అధికారులకు సూచించారు.


ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సోమేశ్వరరావు

పూర్వ విద్యార్థుల చొరవ అభినందనీయం

వజ్రపుకొత్తూరు: వివేకానంద భారతి పాఠశాల పూర్వ విద్యార్థుల చొరవ అభినందనీయమని కరస్పాండెంట్ పేరాడ సోమేశ్వరరావు అన్నారు. చదువుకున్న పాఠశాలకు తమవంతు సహకారంగా పూర్వ విద్యార్థుల బృందం వితరణ చేసిన ఆక్వా గార్డ్ నీటి శుద్ధి యంత్రాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుకుని ప్రయోజకులైన విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయం అన్నారు. పూండి గోవిందాపురంలోని వివేకానంద విద్యా సంస్థలో 2000-01 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.55 వేలు ఖర్చుతో వంద లీటర్ల సామర్థ్యం గల నీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు డి.వణజనాభం, పూర్వ విద్యార్థులు డాక్టర్ గుంట రాజశేఖర్, గొరకల శరత్ కుమార్, కవిటి మూర్తి పాల్గొన్నారు.


తాగునీటి పైపులైన్ ప్రారంభిస్తున్న నాయకులు

తాగునీటి పైపులైన్ ప్రారంభం

పొందూరు: మండలంలోని రాపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ చొరవతో తాగునీటి సౌకర్యాన్ని కూటమి నాయకులు కల్పించారు. రూ.2 లక్షల జెడ్‌పి నిధులతో ఏర్పాటు చేసిన తాగునీటి పైపులైన్‌ను సోమవారం నాయకులు ప్రారంభించారు. టిడిపి జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు బోరు వేసేందుకు స్థలాన్ని ఇవ్వగా అక్కడి నుంచి పాఠశాలకు పైపులైన్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు. ఎన్నోఏళ్లుగా తాగునీటి సౌకర్యానికి నోచుకోక తీవ్ర ఇబ్బందులు పడ్డ విద్యార్థులు ఎట్టకేలకు పాఠశాలకు తాగునీరు సరఫరా కావడంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిహెచ్ శారదాంబ, పిఎంసి చైర్మన్ శేషగిరి, కండాపు శ్రీనివాసరావు, కొంచాడ చిన్నం నాయుడు, హరినాథ్, గొల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వితరణ


పాఠశాలకు అందిస్తున్న విద్యార్థులు

కవిటి: మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2003-04 విద్యార్థులు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. పాఠశాలకు అవసరమైన పోడియం, టెంట్ బహూకరించారు. అందులో భాగంగా రూ.12 వేలు విలువచేసే పోడియంను బల్లెడ దిలీప్ కుమార్ అందజేయగా, రూ.15 వేలు విలువచేసే టెంట్‌ను 2003-04 ఏడాది విద్యార్థులు బహూ కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సనపల రామకృష్ణ, విద్యా కమిటీ చైర్మన్ బల్లెడ శ్రీపతి, స్థానికులు వీరిని అభినందించారు.

ఎపిపిఇసెట్ పరిశీలకునిగా శ్రీనివాసరావు

ఎచ్చెర్ల: ఈ విద్యా సంవత్సరంలో బిపిఇడి, డిపిఇడి వ్యాయామ విద్యా కోర్సుల్లో ప్రవేశానికి గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఎపిపిఇ సెట్)కు పరిశీలకునిగా డా. బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు సెట్ కన్వీనర్ ఆచార్య పి.జాన్సన్ నుంచి నియామక ఉత్తర్వులు బిఆర్‌ఎయుకు అందాయి. ఈనెల 25 నుంచి మూడు రోజుల పాటు గుంటూరు క్యాంపస్ కేంద్రంగా జరగనున్న విద్యార్థుల శారీరక సామర్థ్యం, క్రీడా నైపుణ్యతల పరీక్షలకు ఈయన పరిశీలకులుగా వ్యవహరించనున్నారు. ఈ నియామకంపై బిఆర్‌ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ ఆచార్య పి. సుజాతలు శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు.

గిరిజనులు అభివృద్ధి చెందాలి

మెళియాపుట్టి: గిరిజనులు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా అన్నారు. మండలంలోని కేరాసింగి, గొడ్డ గ్రామాల్లో జన జాతీయ గౌరవ దివాస్ వేడుకల్లో భాగంగా సోమవారం గ్రామసభ నిర్వహించారు. గిరిజనులను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు గ్రామసభల ద్వారా వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, ఎపిఎం త్రినాథమ్మ, సర్పంచ్ బొంతు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

25 నుంచి నిరవధిక సమ్మె

పోలాకి: గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, లేకుంటే ఈ నెల 25 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నట్లు సర్వేయర్ల సంఘం మండల అధ్యక్షులు బెవర శివ తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాల్లో సీనియారిటీ లిస్టులు ప్రకటించాలన్నారు. అర్హులందరికీ ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మోహన్, శ్రీకాంత్, రాంబాబు, హిమబిందు, రేష్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే జయంతి

కవిటి: మాజీ ఎమ్మెల్యే జుత్తు జగన్నాయకులు జయంతి వేడుకలు కవిటి అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కవిటి మండలం అగ్నికుల క్షత్రియ సంఘం అధ్యక్షుడు పొల్లాయి లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా జగన్నాయకులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పులకల శ్రీరాములు మాట్లాడుతూ ఒక ఎమ్మెల్యేగా, ఒక సామాజిక తరగతి ప్రతినిధిగా, ఒక సమాజ సేవకుడుగా జగన్నాయకులు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గ్రూప్ అధ్యక్షుడు పొల్లాయి ముకుందరావు, 20 గ్రామాలకు చెందిన పెద్దలు, సామాజిక వర్గ నాయకులు యువత పాల్గొన్నారు.

కష్టపడితే ఉజ్వల భవిష్యత్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతిఒక్కరూ కష్టపడితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఇచ్ఛాపురంలో 17 కంపెనీలతో జాబ్‌మేళాను ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో నిరుద్యోగులను పట్టించుకునే పాపనపోలేదని అన్నారు. విద్యార్హత బట్టి వచ్చిన ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎవరైనా కష్టపడకుండా అభివృద్ధిలో రావడం జరగదని గుర్తుంచు కోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా అధికారి సాయి, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఆదిత్య కళాశాల ప్రిన్సిపాల్ జీరు శేఖర్, డైరెక్టర్లు ఎస్.వి.రమణ, రాజేంద్రప్రసాద్, కామేష్, టిడిపి పట్టణ అధ్యక్షుడు పత్రీ తవిటయ్య, ప్రధాన కార్యదర్శి నందిగాం కోటి, కొండ శంకర్ రెడ్డి, మండల టిడిపి అధ్యక్షులు పద్మనాభం, జాని, లీలారాణి, జానకిరామ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విప్ అశోక్

జాబ్‌మేళాకు స్పందన

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా స్థానికఆదిత్య డిగ్రీ కళాశాల ఆవరణంలో మెగా జాబ్‌మేళాకు స్పందన లభించింది. 17 ప్రయివేటు సంస్థల ప్రతినిధులు పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ మేళాకు 832 మంది పాల్గొనగా, 281 మందికి వివిధ కంపెనీలకు ఎంపిక య్యారని కళాశాల ప్రతినిధులు ఎస్.వి.రమణ, రాజేంద్ర ప్రసాద్, జీరు శేఖర్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలను అందజేశామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ పర్యవేక్షించారు.

26 నుంచి బంద్

పలాస: పెండింగ్‌లోని సమస్యల పరిష్కారానికి ఈ నెల 26 నుంచి బంద్ నిర్వహిస్తున్నామని మున్సిపల్ శానిటేషన్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం సిహెచ్.మురగన్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్. గణపతి ముఖ్య అతిథులు పాల్గొని మాట్లాడారు. 2011-12 పిఎఫ్ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమచేయకుండా జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు పనిముట్లు ఇవ్వకుండా పని చేయమని చెప్పడం సమంజసం కాదన్నారు. మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు అన్ని మున్సిపాలిటీల్లో ఉద్యోగాలు ఇచ్చినా... పలాస మున్సిపాలిటీలో ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం మంచి పద్ధతి కాదన్నారు. సమస్యలను పరిష్కారం చేయాలని అనేకసార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఈ నెల 26 నుంచి పనులు బంద్ చేస్తున్నామని తెలిపారు. లేబర్‌కోడ్‌లు రద్దు చేయాలని జూలై 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ తెచ్చిన లేబర్ కోడ్‌లను రాష్ట్రంలో అమలు చేయడానికి సిఎం చంద్రబాబు సిద్ధం కావడం కార్మికులకు ద్రోహం చేయడమేనని అన్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కమిషనర్ రామారావుకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా నాయకులు మోహన్, ఎం.రవి, కె.వెంకట్, ఎస్.శంకర్, ఎస్.రమేష్, ఎస్.తిరుపతి, ప్రకాశ, శకుంతల, గురువారి ఉష పాల్గొన్నారు.


పలాస : మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అర్ధనగ్న ప్రదర్శన

శ్రీకాకుళం సిటీ: శ్రీకాకుళం పురపాలక సంఘంలో పనిచేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్యత కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో జడ్‌పి కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. 40 రోజులుగా నిరసన తెలియజేస్తున్నా వేతనాలు పెంచటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మీకోసం ఫిర్యాదుల విభాగంలో వినతిపత్రం అందజేశారు.

ట్రిపుల్ ఐటికి విద్యార్థుల ఎంపిక

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని చక్కా సమజ్ఞ, బోరుభద్ర ఉన్నత పాఠశాల విద్యార్థిని పట్నాన శ్రీముదుల ట్రిబుల్ ఐటికి ఎంపికయ్యారు. ఆదివారం వెలుబడిన ఫలితాల్లో వీరు నూజివీడు ట్రిపుల్ ఐటిలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం పిట్ట గంగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

లావేరు : మండలంలోని మురపాక కెజిబివి పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్టు పాఠశాల ప్రత్యేకాధికారి బల్ల సుధ సోమవారం తెలిపారు. మండలం గుంటుకుపేటకు చెందిన కె.కుసుమశ్రీ, బొంతువలసకు చెందిన ఎన్.లిఖితలు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రత్యేకాధికారి సుధతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

శ్మశానవాటిక కబ్జా

కొత్తూరు : మండలంలోని కర్లెమ్మ పంచాయతీ మహసింగి ఎస్‌సి కాలనీకి చెందిన శ్మశానవాటికను కబ్జాదారులు ఆక్రమించుకున్నారని గిరిజనులు తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ బాలకృష్ణ సోమవారం నిర్వహించిన మీకోసంలో వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ అధికారులు స్పందించి సరిహద్దులను గుర్తించాలని విన్నవించారు. కార్యక్రమంలో గిరిజనులు పి.అశోక్‌కుమార్, శివ, నగేష్, కాంతారావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

పలాస : పలాస డాక్టర్ కణితీస్ ఐటిఐలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి రెండో విడత దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైల జవహర్ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో iti.ap.gov.in దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు ఈ నెల 17న ధ్రువపత్రాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. 22న నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు ఐటిఐ పనివేళల్లో కార్యాలయానికి వచ్చి సంప్రదించాలని కోరారు.

సిసి కెమెరాల ఏర్పాటుకు వినతి

టెక్కలి : ఆలయాల వద్ద సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని నాయకులు హనుమంతు ఉదయ్‌భాస్కర్ కోరారు. ఈ మేరకు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఆలయాల్లో యాత్రికుల తాకిడి పెరుగుతున్న దృష్ట్యా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆలయశాఖాధికారులు, పంచాయతీ పారిశుధ్య కార్మికులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

టెక్కలి : టెక్కలి మండల తహశీల్దార్‌గా డి.సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సూపరింటెండెంట్ రవి నుంచి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారంలో కీలకంగా వ్యవహరించాలని సూచించారు. తహశీల్దార్‌గా 15 రోజుల క్రితం నియమించారు. ఈయనకు కార్యాలయ సిబ్బంది విఆర్‌ఒలు శ్యాం, యుగంధర్, గున్న కోటేశ్వరరావు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మూల్యాంకన రెమ్యూనరేషన్ చెల్లించాలి

శ్రీకాకుళం సిటీ: మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో పాల్గొన్న ఛీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్లకు చెల్లించాల్సిన రెమ్యూనరేషన్ తక్షణమే చెల్లించాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరి ప్రసన్న ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏప్రిల్ మొదటి వారంలో జరిగిన పదో తరగతి మూల్యాంకనంలో పాల్గొన్న ఛీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లుకు కూడా రావాల్సిన రెమ్యునరేషన్ కూడా చెల్లించ లేదన్నారు. గతేడాది సంప్లమెంటరీ పరీక్షలకు సంబంధించి ఈ ఏడాది చెల్లించడం సరైన విధానం కాదని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు డిఎలు ప్రకటించి రావాల్సిన డిఎ, జిపిఎఫ్, సరెండర్ లీవ్ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

న్యాయవిద్య పరీక్షా ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి సంబంధించి న్యాయశాస్త్రం సెమిస్టర్ పరీక్షా ఫలితాలు అంబేద్కర్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ డీన్ డా.ఉదయ భాస్కర్. విడుదల చేశారు. న్యాయశాస్త్రంలో ఒకటవ సెమిస్టర్ ఒకటి, మూడు, ఐదు సెమిస్టర్ ఉండగా ఐదేళ్ల న్యాయశాస్త్ర కోర్సుకు ఒకటి, మూడు, ఐదు, ఏడు, తొమ్మిది పరీక్ష ఫలితాలు వెల్లడించారు. ఒకటవ సెమిస్టర్ 110 మంది పరీక్షకు హాజరుకాగా 89 మంది, మూడవ సెమిస్టర్ పరీక్షకు 90 మందికి 88 మంది, 5వ సెమిస్టర్‌లో 94 మందికి 94 మంది ఉత్తీర్ణత సాధించారు. 5వ న్యాయ శాస్త్రంలో ఒకటవ సెమిస్టర్. 20 మందికి 18 మంది, 3వ సెమిస్టర్‌లో 24 మందికి 22 మంది, 5వ సెమిస్టర్‌లో 28 మందికి 27 మంది, ఏడో సెమిస్టర్‌లో 20 మందికి 20 మంది, తొమ్మిదవ సెమిస్టర్ 25కి 25 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాలపై ఎటువంటి సందేహాలున్నా 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జాబ్‌మేళాకు స్పందన

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించిందిన ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ తెలిపారు. కళాశాల కో-ఆర్డినేటర్ ఝాన్సీరాణి ఆధ్వర్యాన నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు 246 మంది నిరుద్యోగ అభ్యర్థులు పాల్గొన్నారు. ఇందులో 182 మంది ఎంపికయ్యారు. ఈ జాబ్‌మేళాలో కంపెనీ ప్రతినిధులు బి.టి.ఇవెంజల్, బి.ప్రేమ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్ పాల్గొన్నారు. ఎంపికైన వారికి నియామకపత్రాలను ప్రిన్సిపాల్ అందజేశారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

పలాస: ఆర్‌టిసిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. పలాస ఆర్‌టిసి డిపో వద్ద సోమవారం ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ప్రతినెలా 10వ తేదీ జీతాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. వారాంతపు సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పరిష్కారించాలన్నారు. లేని యెడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల అధ్యక్షుడు ముత్యాలరావు, కిరణ్‌కుమార్, సంతోష్, బి.గోపి, పి.దివాకర్ పాల్గొన్నారు.


టెక్కలి : ధర్నా చేస్తున్న ఉద్యోగులు

టెక్కలి : ఆర్‌టిసిలో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆర్‌టిసి గ్యారేజ్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి రాజా, ఉద్యోగులు డి.కృష్ణ, బంకు శ్రీను, శంకర్, పి.కృష్ణ, రాజేష్, ఇ.లక్ష్మి పాల్గొన్నారు.

'యువత పోరు'కు వైసిపి నాయకులు


ఇచ్ఛాపురం : తరలివెళ్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కలెక్టరేట్ వద్ద వైసిపి ఆధ్వర్యాన నిర్వహించిన యువత పోరుకు మండలంలోని కొర్లాం కూడలి నుంచి శ్రీకాకుళం వరకు ర్యాలీగా తరలివెళ్లారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్. తెలిపారు. ఈ ర్యాలీని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులు నర్తు ప్రేమ్ కుమార్, స్వీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్, జెడ్‌పిటిసిలు ఉప్పాడ నారాయణమ్మ, తడక యశోద, ఇప్పిల లోలాక్షి, ఎంపిపిలు బోర పుష్ప, పైల దేవదాస్, నిమ్మాన దాసు, వైస్ చైర్‌పర్సన్ బారతీ దివ్య పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : యువత పోరుకు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యాన వైసిపి నాయకులు తరలివెళ్లారు.

రూట్ మ్యాప్ ప్రకారం సరుకుల తరలింపు

ప్రజాశక్తి- లావేరు

పౌరసరఫరాల మండల గోదాం నుంచి గ్రామాల్లోని రేషన్‌డిపోలకు సరుకులు తరలించేటప్పుడు రూట్ మ్యాప్ ప్రకారం తరలించాలని తహశీల్దార్ జిఇఎల్ శ్రీనువాసరావు గోదాం ఇన్‌ఛార్జి ప్రవీణ్‌ను ఆదేశించారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లుతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఇకెవైసి పూర్తి చేయాలని, డీలర్లు బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. జూలై నెలకు సంబంధించిన 65 ఏళ్ల వృద్ధులకు, వికలాంగులకు రేషన్ ఈనెల 26 నుంచి 30 వరకు డోర్ టు డోర్ అందజేయాలని ఆదేశించారు. డిపోల్లో ప్రభుత్వం నిర్దేశించిన విధంగా సమయపాలన పాటించాలన్నారు. తమకు బియ్యం బస్తాల్లో తరుగులు వస్తున్నాయని పలువురు డీలర్లు సమావేశంలో తహశీల్దార్ ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో గోదాం ఇన్‌ఛార్జి ప్రవీణ్ తప్పనిసరిగా గోదాం వద్ద ఉండి తూకంలో తేడా రాకూడదని, లేదంటే నేనే గోదాం వద్ద కూర్చోవడం జరుగుతుందని తహశీల్దార్ హెచ్చరిం చారు. సమావేశంలో పౌర సరఫరాల ఉప తహశీల్దార్ వై.అరుణ, అర్ఐ రాపర్తి అప్పలరాజు, డీలర్ల సంఘం నాయకులు ముప్పిడి రమేష్, హరికృష్ణ, డీలర్లు ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్ విభాగం సిబ్బందితో అభివృద్ధి పనుల పురోగతిపై సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్ బిల్లుల పరిస్థితిపై ఆరా తీసి చెల్లింపులో ఎటువంటి అలసత్వం వహించకుండా ఉండాలని సూచించారు. ఇప్పటికే పూర్తయిన అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి బిల్లులను నిధి పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. అలాగే ఇంజినీర్లకు లక్ష్యాలను నిర్ణయిస్తూ విధులను కేటాయించారు. సమావేశంలో మున్సిపల్ ఇంజినీరింగ్ డిఇఇ, అసిస్టెంట్ ఇంజనీర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


సమీక్షిస్తున్న కమిషనర్ రామారావు

విద్యామిత్ర కిట్లు పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

ప్రజ్శాక్తి- లావేరు

మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్లను, విద్యార్థి డైరీలను సోమవారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం పూర్ణచంద్రరావు కోరారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉమ్మడిగా కృషి చేస్తే ఉత్తమ ఫలితాలు సాధించగలమన్నారు. సర్పంచ్ ప్రతినిధి పెదనాయుని చిట్టిబాబు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని తెలిపారు. గ్రామపెద్ద శ్రీరాములనాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశలో క్రమశిక్షణ, ఉన్నత స్థానానికి తీసుకు వెళ్తుందన్నారు. ఉపాధ్యాయులు తమ సొంత నిధులతో సమకూర్చిన విద్యార్థుల డైరీలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మనాయుడు, గోపాలరావు, మధుబాబు, పవన్, ఉపాధ్యాయులు ఎస్.కె.ప్రసాద్, పి.గోవిందరావు, ఎం.అనురాధ, కె.వెంకటరావు, పి.తమ్మినాయుడు, కె.చిన పెంటయ్య, ఎస్.రమేష్ బాబు, ఇమ్రాన్ బేగ్ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో రోగుల అవస్థలు

టెక్కలి రూరల్ : టెక్కలి జిల్లా ఆస్పత్రిలో సోమవారం ఒపి విభాగం వద్ద రోగులు అవస్థలు పడ్డారు. ఒపి విభాగంలోని కంప్యూటర్, సాంకేతిక సమస్య కారణంగా వివిధ ఆరోగ్య సమస్యల కోసం చికిత్సకు వచ్చిన రోగులకు రసీదులు అందించడం ఆలస్యమైంది. దీంతో రోగులు క్యూలైన్‌లో నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. కొందరు రోగులు నిరాశతో వెనుదిరగగా, మరికొందరు క్యూలైన్‌లో పడిగాపులు కాశారు. ఆస్పత్రిలో రోజూ ఇదే పరిస్థితి నెలకొండడంతో రోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.


లైన్‌లో ఉన్న రోగులు

సాగు విధానాల్లో మార్పు అవసరం



డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేయడంపై అవగాహన కల్పిస్తున్న ఎఒ

ప్రజాశక్తి- బూర్జ

మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు తమ వ్యవసాయ పద్ధతుల్లో మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ అధికారి ఉషారాణి సూచించారు. సోమవారం బూర్జలో ఫెర్టికమ్ సీడ్ డ్రిల్ ద్వారా గంగు వెంకటప్పల నాయుడు పొలంలో సాగవుతున్న వరి పంటను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. ఇటీవల జూలైలో రావాల్సిన అవసరమైన వర్షాలు లేకపోవడం రైతుల్లో ఆందోళన కలిగించిందన్నారు. రైతులు ముందుగా అప్రమత్తమై, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వేసవి దుక్కులు పూర్తి చేసుకోవాలని సూచించారు. అలాగే తక్కువ నీటితో పండించగల ఫెర్టికమ్ సీడ్‌డ్రిల్ ద్వారా వరిసాగు చేయడం వల్ల అనేక లాభాలు ఉంటాయన్నారు. ఈ పద్ధతిలో ఎరువు, విత్తనం ఒకేసారి వేసే యంత్రాన్ని ఉపయోగించడం ద్వారా సగం విత్తనాలు ఆదా అవుతాయని, నారువేయడం, పొలం దమ్ము చేయడం, నాట్లు వేయడం వంటి ప్రక్రియలు అవసరం లేకుండా కూలీ ఖర్చు సుమారు రూ. 5 వేలు ఆదా అవుతుందన్నారు. 15 కిలోల నుంచి 18 కిలోల వరకు విత్తనాలు అవసరమయ్యే చోట, ఈ పద్ధతిలో తక్కువ విత్తనాలతోనే అధిక దిగుబడి సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో బూర్జ సమన్వయకర్తలు దేవాది యేసు, మొయ్యి ఈశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

మేడపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి- బూర్జ


అప్పలనాయుడు (ఫైల్)

మండలంలో డొంకలపర్త గ్రామానికి చెందిన జడ్డు అప్పల నాయుడు (65) సోమవారం ఇంటి డాబా మీదకు వెళ్లి కాలు జారడంతో కిందకి జారిపడి తీవ్ర గాయాలై అక్కడకక్కడే మృతి చెందాడు. భార్య అప్పమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రవల్లిక తెలిపారు. మృతునికి నలుగురు కుమారులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


లోకనాథం మృతదేహం

నందిగాం : మండలంలోని మద్దిలవానిపేట వద్ద జాతీయ రహదారి 16పై సోమవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. పోలీసులు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నారాయణపురానికి చెందిన మెట్ట లోకనాథం (60) ఆదివారం ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడి జిల్లా తోట గుమ్మడకు వెళ్లాడు. పొలం పనులు ముగించుకొని సోమవారం ఉదయం తిరిగి వస్తుండగా వెనుక నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య లీలావతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

2న 'చలో విజయవాడ'

ఇచ్ఛాపురం : జులై 2న విజయవాడలో నిర్వహించనున్న చలో విజయవాడ ధర్నా విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కన్వీనర్ రమేష్ పట్నాయక్, జిల్లా కార్యదర్శి ఎన్.బలరాం పిలుపు నిచ్చారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఇంజినీర్ కార్మికులతో సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం కమిషనర్ రమేష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్‌గా శ్రీనివాసరావు


శ్రీనివాసరావు

ఆమదాలవలస: మండలంలోని కొర్లకోటకు చెందిన పేడాడ శ్రీనివాసరావు జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈయన ఇప్పటివరకు జిల్లా కేంద్రంలోని బలగ యూనియన్ బ్యాంకులో మేనేజర్‌గా విధులు నిర్వహించారు. పదోన్నతిపై జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు లీడ్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేసిన సూర్యకిరణ్ పదోన్నతిపై రీజనల్ ఆఫీసుకు బదిలీ అయ్యారు. శ్రీనివాసరావు నియామకంపై కొర్లకోట గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

'ఐతమ్' అధ్యాపకునికి డాక్టరేట్


శ్రీకాంత్

టెక్కలి రూరల్: టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ విభాగంలో గణితశాస్త్ర బోధకుడు ప్రొఫెసర్ వి.వి.వి.ఎస్.ఎస్.పి.ఎస్ శ్రీకాంత్‌కు డాక్టరేట్ వచ్చిందని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'గీతం డీమ్డ్ టు' విశ్వ విద్యాలయం నుంచి క్యారెక్టరైజేషన్ ఆఫ్ ఆల్మాస్టా సెమి హాటింగ్ డిస్ట్రిబ్యూ లాటస్ పరిశోధనలో డాక్టరేట్ ప్రదానం చేశారన్నారు. డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌డి డీన్ శ్రీ రాములు, ప్లేస్‌మెంట్ అధికారి ఎం.ఎన్.వి.ఎస్.ఎస్.సంతోష్, సిబ్బంది శ్రీకాంత్‌ను అభినందించారు.

సిఎం సహాయనిధి చెక్కులు అందజేత

ఆమదాలవలస: నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని బాధితులకు ఎమ్మెల్యే సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల సిఎం సహాయనిధి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా ఒకేసారి 39 మంది లబ్ధిదారులకు రూ.కోటి 30 లక్షల సిఎంఆర్ చెక్కులను పంపిణీ చేసినట్లు తెలిపారు. డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, టిడిపి జిల్లా ఉపాధ్యక్షుడు నందివాడ గోవిందరావు, టిడిపి మండల అధ్యక్షుడు అంబల్ల రాంబాబు, రొట్టవలస మాజీ ఎంపిటిసి వెంకటరమణ పాల్గొన్నారు.

శ్రీకాంత్ పరామర్శ

కోటబొమ్మాళి: టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కళింగ కోమటి సంఘం అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షుడు బోయిన రమేష్‌ల మాతృమూర్తి ప్రేమకుమారి ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న పలాస టిడిపి నాయకుడు దువ్వాడ శ్రీకాంత్ పరామర్శించి ఓదార్చారు. అమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.